క్లుప్తంగా

స్వీట్ హౌస్‌లు, బేకరీలపై తనిఖీ చేపట్టండి

సదాశివపేట(సంగారెడ్డి): కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్న పట్టణంలోని స్వీట్‌హౌస్, బేకరీల యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఉమకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని స్వీట్ హౌస్, బేకరీలపై మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించి ప్రజారోగ్యాలు కాపాడాలని కోరారు. బస్టాండ్ పక్కన శ్రీబాలాజీ, దినేశ్‌కుమార్, స్వీట్‌హౌస్‌ల వారు కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారని జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ నాయకులు శ్రీకాంత్, మల్లేశం పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నాగిరెడ్డి


పి.నాగిరెడ్డి


జగదీశ్వర్‌రెడ్డి

జహీరాబాద్: యువజన కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నాగిరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం వెల్లడించిన ఫలితాల్లో ఈ మేరకు ఆయన ఎన్నికైనట్లు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హుగ్గెల్లికి చెందిన కె.జగదీశ్వర్‌రెడ్డి గెలుపొందారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ ఎండీ తన్వీర్ వారిని అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ ఒక్కటే మార్గం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్


సమావేశంలో నాయకులు

కంది(సంగారెడ్డి): మాదిగలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ ఒక్కటే మార్గమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ మాదిగ అన్నారు. శుక్రవారం కందిలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ అయ్యేంత వరకు ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేయరాదని డిమాండ్ చేశారు. అనంతరం మూడు మండలాల ఎమ్మార్పీఎస్ మండల కమిటీలను ఏర్పాటు చేశారు. కంది మండల అధ్యక్షుడిగా నాగరాజు మాదిగ, ఉపాధ్యక్షుడిగా పెద్ద గోపాల్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కొమ్మగల్ల ప్రభు మాదిగ, కొండాపూర్ మండల అధ్యక్షుడిగా మీసాల రాకేశ్, మహిళా విభాగం భాగ్యరాణి, సదాశివపేట మండల అధ్యక్షుడిగా గంగేడి విజయ్ కుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా రేండ్లపల్లి కృష్ణ మాదిగ నియమితులయ్యారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

సదాశివపేట(సంగారెడ్డి): గుర్తుతెలియని వ్యక్తి చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం వ్యక్తి మృతిచెందాడు. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... పట్టణ పరిధిలోని మోమిన్‌పేటకు వెళ్లే దారిలో మహబూబ్‌పాష దర్గా సమీపంలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. గమనించిన స్థానికులు 108కి కాల్ చేసి సమాచారం అందించారు. హుటాహుటిన సిబ్బంది ఇక్కడికి చేరుకొని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి వయసు 50 నుంచి 60 వరకు ఉంటుందని, ఒంటిపై గులాబీ రంగు షర్ట్ ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు.

బాల్య వివాహం నిలిపివేత

ఝరాసంఘం(జహీరాబాద్): మండల పరిధిలోని చీల్మేపల్లిలో శుక్రవారం నిర్వహిస్తున్న బాల్య వివాహాన్ని రెవెన్యూ అధికారులు, ఐసీడీఎస్ అధికారులు నిలిపివేశారు. వివరాలోకి వెళ్తే ... కోహీర్ కు చెందిన మైనర్‌ను చీల్మేపల్లికి చెందిన బాలకృష్ణ కు ఇచ్చి వివాహం చేయడానికి పెద్దలు నిశ్చయించారు. శుక్రవారం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సమాచారం తెలుసుకొని బాలికకు 18 సంవత్సరాలకు 3 నెలలు తక్కువగా ఉందని చెప్పి పోలీసులతో కలిసి ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు వివాహం ఆపివేశారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్‌ను సంగారెడ్డిలోని సఖీ కేంద్రానికి తరలించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మండలానికి చెందిన లబ్ధిదారులకు ఖేడ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేశ్ షెట్కార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్ అందజేశారు. చిన్నముబారక్‌పూర్‌కు చెందిన సాయిలుకు రూ.16వేలు, దామర్‌చెర్వుకు చెందిన శంకర్‌కు రూ.60వేలు, చీమల్‌పాడ్‌కు చెందిన లక్ష్మికి రూ.14,500లు మంజూరైన చెక్కును అందజేశారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతిని జిల్లాలో శుక్రవారం నిర్వహించారు. అన్ని వర్గాల వారికి సమన్యాయం జరగాలని రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశయ సాధనకు అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.


రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లో..


పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలో..


పటాన్‌చెరు : అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధు


సంగారెడ్డి ఎడ్యుకేషన్: మారేపల్లిలో..


న్యాల్‌కల్(జహీరాబాద్) : హద్నూర్‌లో..

వారసులకు ఉద్యోగాలు కల్పించాల్సిందే

కల్హేర్(నారాయణఖేడ్): జీఓ 81 ప్రకారం 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కలిపించాలని ఆ సంఘం నారాయణ ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కల్హేర్‌లో తహసీల్దార్ శివశ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశల్లో ఈ విషయమై చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మె చేస్తామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదినం

జోగిపేట(అందోల్): మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ జన్మదినాన్ని అందోల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన్ను నియోజకవర్గ ముఖ్య నాయకులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు సాయికుమార్, పుల్కల్ మండల అధ్యక్షుడు ముద్దాయిపేట విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం పోతులబోగుడాలోని క్రాంతికిరణ్ నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- దారులన్నీ గుంతలమయం
- మరమ్మతుకు నోచని రహదారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు


చేర్యాల-ఇంద్రకరణ్ రోడ్డు దుస్థితి

కంది(సంగారెడ్డి): వర్షాకాల సీజన్‌లో కురిసిన వల్ల పలుచోట్ల గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల కోతకు గురయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో కంకర తేలి గుంతలు పడ్డాయి. కంది మండలం చేర్యాల, ఇంద్రకరణ్, బ్యాతోల్, ఎర్దనూర్, వడ్డేనగూడ తండాతో పాటు ఇస్మాయిల్ ఖాన్ పేట బైపాస్ రోడ్డు, మక్త అల్లూర్, ఉత్తర్‌పల్లికి వెళ్లే రోడ్లపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పూర్తిగా దెబ్బతినడంతో అజాగ్రత్తగా వాహనం నడిపితే కింద పడి ఆస్పత్రి పాలవుతామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న చేర్యాల ఇంద్రకరణ్ రోడ్డుపైనా కంకర తేలింది. పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇదే దారిపై రోజూ నీటి ట్యాంకర్లు, కంకర, ఇసుక లారీలు వెళ్తుడటంతో రోడ్డు దెబ్బతింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాడైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణను వివరణ కోరగా ప్రస్తుతం రోడ్లన్నీ పాడైన మాట వాస్తవమేనన్నారు. రహదారుల మరమ్మతు కోసం నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జాప్యం జరుగుతోందన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తామన్నారు.

ఎస్పీని కలిసిన పింకీ కుమారి


ఎస్పీ రూపేశ్‌ను కలిసిన పింకీ కుమారి

సంగారెడ్డి జోన్: ఎస్సైగా పదోన్నతి పొందిన ఏఎస్‌ఐ పింకీ కుమారి శుక్రవారం ఎస్పీ రూపేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2020 రాష్ట్ర పోలీసు నియామక మండలి చేపట్టిన నియామకాలలో ఆమె ఫింగర్ ప్రింట్ బ్యూరోలో ఏఎస్‌ఐగా నియామమయ్యారని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు శాఖలో నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది ఫింగర్ ప్రింట్ ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. పదోన్నతి పొందిన ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

కస్తూర్బా గాంధీ హాస్టల్ తనిఖీ


వంటగదిని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ భిక్షపతి

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని కస్తూర్బా గాంధీతో పాటు గిరిజన గురుకుల వసతి గృహాలను తహసీల్దార్ భిక్షపతి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. వంట గదులు, స్టోర్ రూములను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి ప్రిన్సిపాల్‌లు వెంకట్, నారాయణ, కవిత, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : ఈనెల 8, 9వ తేదీలలో ఖేడ్‌లో నిర్వహించే యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. శుక్రవారం సంగారెడ్డిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభల్లో విద్యారంగ సమస్యల పట్ల, నూతన జాతీయ విద్యావిధానం అమలు తీరుతెన్నులు అనే అంశంపై చర్చిస్తామని సాయిలు అన్నారు. సభలకు మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్రకోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి హాజరవుతారన్నారు. మహాసభలకు జిల్లావ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కమలాకర్‌రావు, సుచరిత, నాయకులు సూర్యనారాయణ శర్మ, శ్రీనివాస్, సంధ్యారాణితో పాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేయాలి

టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కష్ణమూర్తి

సంగారెడ్డి : ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేపట్టాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లె కష్ణమూర్తి శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో ఆర్టీసికి రూ.7500 కోట్ల ఆదాయం పెరిగిందని యాజమాన్యం ప్రకటించిన నేపథ్యంలో కార్మికుల సంక్షేమానికి కూడా పాటుపడాలని పేర్కొన్నారు. తక్షణమే 30 శాతం ఫిట్మెంట్, ఏప్రిల్ 2021 నుంచి వేతన సవరణ చేపట్టాల్సి ఉందని కోరారు. చట్టబద్ధంగా నాలుగు నెలల్లో ఏప్రిల్ 2025 వరకు రెండు పేస్కేళ్లు అమలులోకి రావాల్సి ఉందని తెలిపారు.

రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే చర్యలు


మరమ్మతు పనులు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వాహనాదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ పవన్ హెచ్చరించారు. శుక్రవారం తెల్లాపూర్ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో వాహనాదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణించకుండా బారికేట్లు ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న గుంతలను ట్రాఫిక్ సిబ్బంది స్వయంగా మరమ్మతు చేపట్టారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పవన్ తెలిపారు. ప్రధానంగా వాహనాదారులు ట్రాఫిక్ నిబంధలను తప్పకుండా పాటించాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని తెలిపారు.

గ్రామీణ అనుభవ కార్యక్రమం

జహీరాబాద్: మండలంలోని రంజోల్‌లో కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు పీఆర్‌ఏ భాగస్వామ్య గ్రామీణ అనుభవ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ చిత్రపటం నేలపై గీసి ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో రంగు ఇచ్చారు. ప్రభుత్వ భవనాలు, మందిరాలు, మసీదులు, చర్చి, బ్యాంక్, పోస్టాఫీస్, రైతు వేదిక, పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, నేల రకాలు, సాగు చేసే పంటలు, వాటి శాతం తేలిసేలా చిత్రీకరించారు. గ్రామ చరిత్ర, ఏయే సంవత్సరాల్లో ఏయే వసతులు కల్పించారనే దాని గురించి తెలుసుకున్నారు. నెల రోజులుగా గ్రామంలో ఉంటూ రైతుల వద్ద అనేక విషయాలు తెలుసుకున్నామన్నారు. పీఆర్‌ఏ నిర్వహణ కోసం ఏఈఓ ప్రదీప్ తన వంతు సహకారం అందిస్తున్నారన్నారు.


రంజోల్‌లో ఉద్యాన కళాశాల విద్యార్థులు


జిన్నారం (పటాన్‌చెరు):లో..


రామచంద్రాపురం(పటాన్‌చెరు): హౌస్ అరెస్టులో కార్పొరేటర్ సింధు

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టు

ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, హరీశ్‌రావులను అరెస్టు చేసినందుకు గాను హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద బీఆర్‌ఎస్ నిరసనలకు పిలుపునివ్వగా.. ఆయా మండలాల్లోని నేతలను ఎక్కడికక్కడా శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ముఖ్యనేతలను హౌస్ అరెస్టు చేశారు. సాయంత్రం సొంతపూచికత్తుపై విడుదల చేశారు. – నెట్‌వర్క్


కల్హేర్: సిర్గాపూర్‌లో పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నేతలు

సంక్షిప్త వార్తలు

◆ **ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన**

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్‌ఐ రాములు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ కు చెందిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు మండల పరిధిలోని పాశమైలారంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ను సందర్శించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ రాములు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి, ఫోన్‌లలో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **నట్టల నివారణ మందులు తప్పనిసరి**

వట్‌పల్లి(అందోల్): జీవాల ఎదుగుదలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులను వేయించాలని అందోల్ మండల పశువైద్యాధికారి డా.విహారికా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్మాయిపేట్ లో పశుగనాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువులకు నిర్వకోశ చికిత్సలు, సాధారణ చికిత్సలు, లేగా దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం వంటి వైద్య సేవలు అందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆడ దూడల ఉత్పత్తికి సబ్సిడీ ఇస్తున్నట్లు గోపాలమిత్ర సూపర్‌వైజర్ సి. అర్జునయ్య తెలిపారు. కార్యక్రమంలో అనీషా బేగం, గోపాల మిత్రులు నాగరాజు, రాజిరెడ్డి, శంకరయ్య, ప్రభు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

◆ **అంగన్‌వాడీ కార్యకర్త మృతి**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌కు చెందిన సునంద(50). కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉయదం మృతిచెందింది. అంత్యక్రియలకు జహీరాబాద్ ఐసీడీఎస్ సీడీపీఓ అంజమ్మ హాజరై ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు గాను బాధిత కుటుంబానికి రూ.20వేల చెక్కు అందజేశారు.

◆ **అధ్యక్షకార్యదర్శుల ఎన్నిక**

సదాశివపేట(సంగారెడ్డి): మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షకార్యదర్శులుగా మహమ్మద్ సాజిద్ పటేల్, మహమ్మద్ ముక్రమ్‌లు ఎన్నికయ్యారు. శుక్రవారం విలేకరులతో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాట్లాడారు. మండల పరిధిలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.ఐదువందలకే గ్యాస్, 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి యూత్ కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

◆ **క్రీడాకారులను ప్రోత్సహించాలి**

సంగారెడ్డి టౌన్ : గ్రామాలలోని క్రీడాకారులను ప్రోత్సహించాలని సంగారెడ్డి మండల ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలకు స్థలాలను పరిశీలించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. గ్రామ, మండలస్థాయిలో విజేతలుగా నిలిచే వారికి జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహిస్తారన్నారు. క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

◆ **అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం**

మునిపల్లి(అందోల్): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మోడల్ స్కూల్‌లో ఎంఈఓ భీంసింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లిక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.